## చెరువు భూమి కబ్జా చేస్తే చర్యలు

కోహీర్, ఏప్రిల్15: చెరువు భూమి కబ్జా చేస్తే చర్యలు తీసుకుంటామని నీటి పారుదల శాఖ అధికారులు హెచ్చరించారు. మండలంలోని దిగ్వాల్ గ్రామానికి చెందిన గొల్లకుంట చెరువు భూమిని కబ్జా చేసేందుకు అదే గ్రామానికి చెందిన పటేల్ ఫంక్షన్ హాల్ యజమాని ప్రయత్నిస్తున్నారని నీటి పారుదల శాఖ ఏఈ రవీందర్ వెల్లడించారు. మంగళవారం గ్రామ చెరువును కబ్జా చేసేందుకు కొంతమంది పనులు ప్రారంభించారని గ్రామానికి చెందిన యువకులు ఏఈ రవీందర్‌కు సమాచారం అందించారు. దీంతో ఆయన ఘటనా స్థలాన్ని సందర్శించారు. చెరువు వద్ద చేపట్టిన పనులను నిలిపివేయించారు. వెంటనే అక్కడి నుంచి సామగ్రిని తొలిగించాలని ఆదేశించారు. అనంతరం కబ్జాకు యత్నిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోహీర్ పోలీస్ స్టేషన్, తహసీల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. చెరువు భూమి రక్షణ కోసం ఎఫ్‌టీఎల్ సర్వే నిర్వహించాలని ఆర్ఐ సత్యనారాయణను కోరారు.

## తండాల్లో ట్యాంకర్లతో నీటి సరఫరా

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

నారాయణఖేడ్, ఏప్రిల్ 15: నారాయణఖేడ్ మండలం శేరి తండా, అక్లయి తండాల్లో నెలకొన్న నీటి కష్టాలను ఎత్తి చూపుతూ మంగళవారం 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో తండాల్లో తాగు నీటి తిప్పలు అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి వివరణ ఇచ్చారు. ఆయా తండాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా అయ్యే వరకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తామని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పైప్‌లైన్ లోపం కారణంగా తండాలకు కొన్నిరోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని, బుధవారం పైప్‌లైన్ బాగు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలని అధికారులకు సూచించామన్నారు.

## విద్య భవిష్యత్తుకు బంగారు బాట

గుమ్మడిదల, ఏప్రిల్ 15: మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. కార్యక్రమంలో సీడీపీవో జయరాంనాయక్ పాల్గొని మాట్లాడారు. పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు తప్పకుండా పంపించాలని తల్లిదండ్రులను కోరారు. మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని టీచర్లను ఆదేశించారు. గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా చిన్నారులు ప్రత్యేక దుస్తులు ధరించారు. ప్రయివేటుకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాలు బాలల భవితకు బంగారు బాటలు వేసేవిధంగా ముందుకు సాగుతున్నాయన్నారు. మైత్రీ ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్‌కుమార్, మాజీ సర్పంచ్ తులసి దాస్‌తో కలిసి చిన్నారులకు మెమోంటోలు బహూకరించారు. కార్యక్రమంలో కవిత, లలిత, మంద భాస్కర్ రెడ్డి, ఎలుక కృష్ణ పోచమ్మ, శైలజ, గిరిజ, పుష్ప, మంగమ్మ ఉన్నారు.

## కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలి

కంది, ఏప్రిల్ 15: వేసవిని దృష్టిలో పెట్టుకొని ఉపాధి హామీ కార్మికులకు పనిప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని ఎంపీవో మహేందర్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని చిద్రుప్ప, వడ్డెనగూడ తండాల్లో పర్యటించి ఉపాధి పనులు, నర్సరీలు, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణను పరిశీలించారు. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, తాగునీటితోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని సూచించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, సెగ్రిగేషన్ షెడ్డును వినియోగంలోకి తేవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. మండుతున్న ఎండలతో నర్సరీల్లో మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు.

## లైంగిక దాడి కేసులో నిందితుడి అరెస్ట్

అందోల్, ఏప్రిల్ 15: లైంగిక దాడి కేసులో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు జోగిపేట సీఐ అనిల్‌కుమార్ మంగళవారం తెలిపారు. వట్‌పల్లి మండలం పల్వట్లకు చెందిన మహిళ ఈనెల 10న చీరలు కొనేందుకు జోగిపేటకు వెళ్లగా గుర్తుతెలియని వ్యక్తి నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఫోన్‌లో పరిచయం పెంచుకున్న వ్యక్తి జోగిపేటకు వచ్చి షాపింగ్ తర్వాత మహిళను బైక్‌పై ఎక్కించుకొని అన్నాసాగర్ శివారులోకి వెళ్లి మద్యం తాగి మహిళపై లైంగిక దాడి చేశాడు. అనంతరం మహిళను వట్‌పల్లి మండలం నాగులపల్లి శివారులో దింపేయగా తనను ఇంటి వద్దే దింపాలంటూ బాధితురాలు గొడవకు దిగడంతో ఆమెపై దాడి చేసి చెవి కమ్మలు, పుస్తెల తాడు తీసుకొని పరారయ్యాడు. దీంతో బాధితురాలు వట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడి కాల్స్ ఆధారంగా దర్యాప్తు చేపట్టి మనూర్ మండలం బెల్లాపూర్‌కు చెందిన నరేశ్‌రెడ్డిగా గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు, సిబ్బంది

## అగ్ని ప్రమాదాలపై అవగాహన ఉండాలి

జహీరాబాద్, ఏప్రిల్ 15: అగ్ని ప్రమాదాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి జహీరాబాద్ అగ్నిమాపక కేంద్రం అధికారి శ్రీనివాస్ అన్నారు. జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం జహీరాబాద్‌లోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌లో అగ్నిమాపక వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు వేసవిలోనే ఎక్కువగా జరుగుతాయని, వాటిపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు 101, 102లను సంప్రదించాలన్నారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్‌లో అగ్నిమాపక సిబ్బంది ప్రయాణికులకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది సలీం, పవన్, రామకృష్ణ, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**డిపోలో అగ్నిమాపక వారోత్సవాలు**

నారాయణఖేడ్, ఏప్రిల్ 15: నారాయణఖేడ్ ఆర్టీసీ డిపోలో డీఎం మల్లేశయ్య ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహించారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శ్రీధర్ అగ్నిమాపక నివారణ చర్యల గురించి ఆర్టీసీ ఉద్యోగులకు వివరించారు. అగ్నిప్రమాదాలు సంభవించిన సమయాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మెకానికల్ ఇంజినీర్ దశరథరావు, ఫైర్ స్టేషన్ ఎల్ఎఫ్‌వో విఠల్, డీవోపీ విజయ్‌కుమార్, నబీ, కనకరాజ్, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

కోహీర్, ఏప్రిల్15:దిగ్వాల్ గ్రామ 65వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై సతీశ్‌వర్మ కథనం ప్రకారం.. రాయికోడ్ మండలంలోని హుస్నాబాద్‌కు చెందిన సంగమేశ్వర్(35) బైక్‌పై జహీరాబాద్ నుంచి సంగారెడ్డి వైపునకు బయలు దేరాడు. దిగ్వాల్ గ్రామ పిరామల్ పరిశ్రమ వద్దకు చేరుకోగానే బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న డివైడర్‌పై పడ్డాడు. అతడి తలకు బలమైన గాయాలుకావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. పోస్టుమార్టం కోసం అంబులెన్స్‌లో జహీరాబాద్ దవాఖానకు తరలించారు. అతడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# డంపింగ్ యార్డు వద్దంటూ వినతుల వెల్లువ



గుమ్మడిదలలో ప్యారానగర్ డంపింగ్ యార్డుకు వ్యతిరేకంగా తహసీల్ కార్యాలయం కౌంటర్లలో వినతులు సమర్పిస్తున్న గ్రామస్తులు



గుమ్మడిదలలో ప్యారానగర్ డంపింగ్ యార్డు వద్దంటూ తహసీల్దార్ పరమేశానికి అర్జీలు అందజేస్తున్న జేఏసీ నాయకులు

- **ప్యారానగర్ డంపింగ్ యార్డుపై గుమ్మడిదల తహసీల్ కార్యాలయంలో ప్రజాభిప్రాయాలు**
- **దండులా కదలివచ్చిన బాధిత గ్రామాల ప్రజలు**
- **కౌంటర్లు ఏర్పాటు చేసిన రెవెన్యూ అధికారులు**

గుమ్మడిదల, ఏప్రిల్15: డంపింగ్‌యార్డు (ఎంఎస్ డబ్ల్యూ) వద్దే వద్దంటూ మున్సిపాలిటీ ప్రజలు వినతుల రూపంలో అర్జీలను తహసీల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కౌంటర్లలతో అధికారులకు సమర్పించారు. ప్యారానగర్ డంపింగ్ యార్డు ఏర్పాటుపై జిల్లా యంత్రాంగం అభ్యంతరాలు తెలియజేయాలని ఈ నెల 3న నల్లవల్లి పంచాయతీకి నోటీస్ అతికించడంతో ఇటీవల నల్లవల్లి, కొత్తపల్లి గ్రామస్తులు తహసీల్ కార్యాయంలో అధికారులకు డంపింగ్ యార్డు వద్దంటూ అర్జీలు సమర్పించిన విషయం తెలిసిందే. మంగళవారం గుమ్మడిదల మున్సిపాలిటీలో ప్రజలందరూ మహిళలు, రైతులు, యువకులు, గ్రామస్తులందరూ కలిసి ప్యారానగర్ డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ) వద్దని తహసీల్ కార్యాలయంలో అర్జీలు పెట్టుకున్నారు. వందల మంది తహసీల్ కార్యాలయానికి వచ్చి తమ అభ్యంతరాలను వినతుల రూపంలో అర్జీలు తహసీల్దార్‌కు సమర్పించారు. ఇందులో రైతు జేఏసీ నాయకులు చిమ్ముల జైపాల్‌రెడ్డి, చిమ్ముల గోవర్ధన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నర్సింహారెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు చిన్నపాపని కుమార్‌గౌడ్, ఆలయకమిటీ అధ్యక్షుడు మద్దుల బాల్‌రెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు సదానందరెడ్డి, ఆకుల సత్యనారాయణ, సూర్యనారాయణ, ఆంజనేయులు యాదవ్ గ్రామస్తులు పాల్గొన్నారు.

**70వ రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు**

ప్యారానగర్ డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని అన్నారం గ్రామస్తులు డిమాండ్ చేశారు. మంగళవారం గుమ్మడిదలలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష 70వ రోజుకు చేరుకుంది. దీక్షలో అనంతారం యాదవ సంఘం సభ్యులు పాల్గొన్నారు. వీరికి రైతు జేఏసీ నాయకులు సంఘీభావం తెలిపారు. నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాల్లో రిలే నిరాహార దీక్షలో రైతులు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు జేఏసీ నాయకులు మాట్లాడుతూ డంపింగ్‌యార్డు(ఎంఎస్‌డబ్ల్యూ)కు వ్యతిరేకంగా 70 రోజుల నుంచి రిలే నిరాహారదీక్షలు చేస్తున్నా ప్రభుత్వం, యంత్రాంగం స్పందించకపోవడం అన్యాయమన్నారు. ఇక్కడి గ్రామాల ప్రజల బాధలు తెలుకొని సర్కారు డంపింగ్ యార్డుకు ఇచ్చిన అనుమతులను వెంటనే ఉపసంహరించుకోవాలి డిమాండ్ చేశారు. దీక్షలో అనంతారం, నల్లవల్లి, కొత్తపల్లి గ్రామాలకు చెందిన రైతు జేఏసీ నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మండలాధ్యక్షుడిగా రాంచంద్రారెడ్డి



హత్నూర, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా కొన్యాల గ్రామానికి చెందిన రాంచంద్రారెడ్డిని మంగళవారం ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నియమించారు. మండలంలోని మంగాపూర్‌లో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడిగా రాంచంద్రారెడ్డిని నియమిస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. నూతన అధ్యక్షుడితో కలిసి మండలంలో పార్టీ బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. అనంతరం ఈనెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వాల్‌పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, నర్సింహారెడ్డి, రవికుమార్, శివశంకర్‌రావు, దామోదర్‌రెడ్డి, అర్జున్, శ్రీకాంత్, అజ్జు, సురేందర్‌రెడ్డి, మధు, ఆశయ్య, కృష్ణ, కిశోర్, శేఖర్ గౌడ్ పాల్గొన్నారు.



నాగరాజుకు నియామకపత్రం అందజేస్తున్న ఆదర్శ్‌రెడ్డి

## బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడిగా నాగరాజు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 15: బీఆర్ఎస్ పటాన్‌చెరు పట్టణాధ్యక్షుడిగా నాగరాజును నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్‌రెడ్డి నియమించారు. మంగళవారం పటాన్‌చెరు మండలం ముత్తంగిలో జరిగిన బీఆర్ఎస్ మండల సమావేశంలో నాగరాజుకు ఆదర్శ్‌రెడ్డి, పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్, మాజీ జడ్పీటీసీ గడీల కుమార్ గౌడ్‌లతో కలిసి వేదికపై పటాన్‌చెరు పట్టణాధ్యక్షుడిగా నియమిస్తున్నామని నియామకపత్రం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తనపై నమ్మకంతో పట్టణ అధ్యక్షుడిగా బాధ్యతలు ఇచ్చిన నాయకులకు నాగరాజు ధన్యవాదాలు తెలిపారు.



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న మాజీఎంపీపీ రవీందర్ గౌడ్

## లబ్ధిదారులకు చెక్కులు అందజేత

జిన్నారం, ఏప్రిల్ 15: జిన్నారం మండలంలోని సోలక్పల్లి, శివానగర్, జిన్నారం, కొడకంచి, వావిలాల, లక్ష్మీపతి గూడెం, మాదారం, మంత్రికుంట గ్రామాల్లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన రూ.45 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశామన్నారు.

## నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి

సంగారెడ్డి కలెక్టరేట్, ఏప్రిల్ 15: జిల్లాలో నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఆ సంఘం అధ్యక్షుడు లకుడారం మాణిక్ ప్రభు, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం పేర్కొన్నారు. మంగళవారం జిల్లా పరిషత్ హాలులో నాయీబ్రాహ్మణుల సేవాసంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ సమస్యల పరిష్కారంతోపాటు, హక్కుల కోసం అందరూ ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం నూతన కమిటీ ఏర్పడిన రెండు నెలల్లో ఎన్నో సమస్యలు పరిష్కరించామని గుర్తు చేశారు. ఇటీవల మృతి చెందిన నాగరాజు కుటుంబ సభ్యులకు సంఘం తరపున ఆర్థికసాయం అందజేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, ఉపాధ్యక్షుడు రంజోల్ ప్రభు, కోశాధికారి శేఖర్, మురారినాయీ, స్వాగత ప్రభు, పెంటయ్య, వీరన్న, ఆంజనేయులు, సత్యం, చరణ్, రాము, పాండు, అనిల్, రాజు, నర్సింహులు, రాజు, హనుమంతు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బైక్ అదుపు తప్పి ఒకరి మృతి..మరొకరికి గాయాలు

చౌటకూర్, ఏప్రిల్ 15: మండలంలోని శివంపేట శివారులో బీరు పరిశ్రమ వద్ద సంగారెడ్డి–నాందేడ్, అకోలా 161 జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం...మెదక్ జిల్లా పెద్ద శంకరంపేట మండలం రామోజీపల్లికి చెందిన దంతెల సాయిరాజ్ (30), దంతెల బాలయ్య (39) హైదరాబాద్‌లో ఉంటూ జీవనం వెళ్లదీస్తున్నారు. సోమవారం స్వగ్రామంలో జరిగిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు టీఎస్ 35 ఏ 3639 నంబరు గల మోటరు బైక్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 12 గంటలకు శివంపేట శివారులోని బీరు పరిశ్రమ వద్దకు రాగానే జాతీయ రహదారిపై బైక్ అదుపు తప్పింది. బైక్‌పై వెనుక కూర్చొని ఉన్న దంతెల బాలయ్య(39) కింద పడటంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో దంతెల సాయిరాజ్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బాలయ్య మృతదేహానికి సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించారు. మృతుడి భార్య రేవతి ఫిర్యాదు మేరకు పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతి కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి



హత్నూరలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి


హత్నూర, ఏప్రిల్ 15:రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హత్నూర, నస్తీపూర్, దౌల్తాబాద్, కాసాల, పన్యాల, కొన్యాల, చీక్‌మద్దూర్, లింగాపూర్, గోవిందరాజ్‌పల్లి, సిరిపుర, బోర్పట్ల, పల్పనూర్, చింతల్‌చెరు, సాదుల్లానగర్, నాగారం, రొయ్యపల్లి గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో సకాలంలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, ఏపీఎం దేవేందర్, రాష్ట్ర లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నర్సింహులు, నాయకులు దామోదర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, నర్సింహారెడ్డి, రవికుమార్, దుర్గారెడ్డి, శివశంకర్ రావు, అర్జున్, శ్రీకాంత్, అజ్జు, సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి



కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రధానకార్యదర్శి సత్యవతి, పక్కన కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ, ఎండీ శైలజారామయ్యర్

రామచంద్రాపురం, ఏప్రిల్ 15: మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలని హ్యాండీ క్రాఫ్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మేనేజింగ్ డైరెక్టర్ శైలజారామయ్యర్, భారతీనగర్ డివిజన్ కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి అన్నారు. ఈశ్వరాంబ మహిళా సొసైటీ ఆధ్వర్యంలో గురుశిష్య హస్తశిల్పి ప్రశిక్షణ్‌లో భాగంగా 30మంది మహిళలకు చేనేత వస్త్రాలు, అల్లికలు తదితర వాటిలో ఉచిత శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉచితంగా టూల్ కిట్ పంపిణీ కార్యక్రమాన్ని కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణ, ఎండీ శైలజా రామయ్యార్, కార్పొరేటర్లు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సహకారంతో మహిళలకు హస్తకళలు, చేనేత వస్త్రాలు, అల్లికలు, ఎంబ్రాయిడరీ, చెక్క పని, చెక్క బొమ్మలు, ఫర్నిచర్ అలంకరణ వస్తువుల గురించి అవగాహన పెంపొందిస్తూ 45రోజులపాటు శిక్షణ ఇచ్చామన్నారు. మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ సహకారంతో మహిళలకు రోజువారీ వేతనం రూ. 300 ఇచ్చామని చెప్పారు. శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి సాధిస్తారని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గుర్తింపుకార్డుతో పాటు టూల్ కిట్లు అందజేశామన్నారు. స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపర్చేందుకు తనవంతుగా పూర్తి సహకారం అందజేస్తామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ ప్రధానకార్యదర్శి సత్యవతి, రాధ, బేబీ, జ్యోతి, లక్ష్మి ఉన్నారు.



మరియంపూర్ శివారులోని వీరభద్రేశ్వరస్వామి జాతరకు హాజరైన జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

## వీరభద్రేశ్వరుడి సన్నిధిలో ఎమ్మెల్యే పూజలు

జహీరాబాద్, ఏప్రిల్ 15: న్యాల్‌కల్ మండలం మరియంపూర్ శివారులోని వీరభద్రేశ్వర స్వామి జాతరకు తెలంగాణ, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తుల భారీగా తరలివచ్చారు. మంగళవారం స్వామివారికి వేదపండితులు పాదపూజ, రుద్రాభిషేకం, అభిషేకం, హారతి తదితర పూజలు నిర్వహించారు. భాజాభజంత్రీల హోరు, భజన కీర్తనల మధ్య స్వామివారి పల్లకీసేవను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఆలయం వరకు ఊరేగింపు చేపట్టారు. అనంతరం పలు ప్రాంతాలకు చెందిన పీఠాధిపతులు రాజశేఖర్, సోమలింగ శివాచార్య, ఈశ్వరయ్య స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ప్రవచనాలు అందజేశారు. ప్రతి ఒక్కరూ భగవన్నామ స్మరణ పాటించాన్నారు. జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పార్టీ నాయకులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ అధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్, నర్సింహారెడ్డి, సంగ్రాం పాటిల్, మిథున్ రాజ్, సంగమేశ్వర్, మాజీ సర్పంచులు రవికుమార్, మల్లారెడ్డి పాల్గొన్నారు.



మార్కెట్ యార్డులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## చివరి గింజ వరకూ ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

సదాశివపేట, ఏప్రిల్ 15: రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకూ మద్దతు ధర ఇచ్చి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం మార్కెట్ యార్డు, పెద్దాపూర్ రైతు వేదికల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలారెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకొని కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు, గోనె సంచులు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం దొడ్డు రకం ధాన్యానికి బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు దళారుల బారినపడి మోసపోకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గడీల రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

కొండాపూర్, ఏప్రిల్ 15: మండల పరిధిలోని మల్కాపూర్, తొగర్‌పల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ కార్పొరేషన్ చైర్మన్ నిర్మలాజగ్గారెడ్డి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా నేరుగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్లు రాజు, పవన్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సడాకుల కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, తహసీల్దార్ అశోక్, ఎంపీడీవో శ్రీనివాస్, మండల వ్యవసాయధికారి గణేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మ్యాకం విఠల్, మండల మాజీ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, పట్లోళ్ల మల్లేశం, గోవర్ధన్‌రెడ్డి, రాంచందర్, రాజగౌడ్, ప్రేమనందం, మల్లాగౌడ్, ప్రకాశం, మోహన్, రాందాస్, రాజు, నర్సింహారెడ్డి, గౌరిరెడ్డి. శ్రీధర్‌రెడ్డి, షఫీ, రైతులు ఉన్నారు.

**తాడ్దానిపల్లిలో...**

చౌటకూర్, ఏప్రిల్ 15: మండలంలోని తాడ్దానిపల్లిలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ తిమ్మారెడ్డి మల్లారెడ్డి ప్రారంభించారు. రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని వారు సూచించారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ రకానికి మద్దతు ధర చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నత్తి దశరత్, చక్రియాల ఆలయ కమిటీ చైర్మన్ భానూరి లక్ష్మణ్, నాయకులు కలాలి ఈశ్వర్‌గౌడ్, మౌలానా, మక్సూద్ అలీ, మల్లికార్జున్‌గౌడ్, రాములు, ఎసాన్ పాషా, భానుచందర్, సాజీద్, రసూల్, నిస్సార్, మున్వర్ అలీ, కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బొల్లారం పారిశ్రామిక వాడలో పీసీబీ తనిఖీలు



బొల్లారం పారిశ్రామిక వాడలో రసాయన వ్యర్థ జలాల శాంపిల్స్ సేకరిస్తున్న ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ రవీందర్

జిన్నారం, ఏప్రిల్ 15:ఐడీఏ బొల్లారం పారిశ్రామిక వాడలోని పలు పరిశ్రమల నుంచి యథేచ్ఛగా రసాయన వ్యర్థ జలాలు విడుదల చేస్తూ బహిరంగ ప్రదేశాలతోపాటు రైతాంగానికి తీవ్ర నష్టాన్నికలిగిస్తున్న పరిశ్రమలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆత్మ కమిటీ డైరెక్టర్, జిల్లా ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి మంగళవారం పీసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇప్పటికే పలుమార్లు పీసీబీ యంత్రాంగానికి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమన్నారు. ఓ వైపు పర్యావరణంతోపాటు మరో వైపు రైతాంగానికి పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థ జలాలు తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని వాపోయారు. బాధ్యులైన పరిశ్రమలపై తగిన విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పీసీబీ అధికారి కుమార్ పాఠక్ ఫిర్యాదులపై స్పందించారు. వెంటనే సిబ్బందిని విచారణ జరపాలని ఆదేశించారు. ఈ మేరకు ఎన్విరాన్మెంట్ సైంటిస్ట్ రవీందర్ పారిశ్రామిక వాడలోని పరిశ్రమల సమీపంలో నిల్వ ఉన్న వ్యర్థ జలాల శాంపిళ్లను సేకరించారు. అనాలసిస్ రిపోర్టు ఆధారంగా పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు వెంకటయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

## రజతోత్సవ సభను విజయవంతం చేయాలి


**ఎమ్మెల్యే చింతా ప్రభాకర్**

సదాశివపేట, ఏప్రిల్ 15: ఎల్కతుర్తి రజతోత్సవ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పట్టణ నాయకులతో సమావేశం నిర్వహించారు. బహిరంగ సభ జన సమీకరణపై నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ..ఎల్కతుర్తిలో ఈనెల 27న జరగనున్న రజతోత్సవ సభకు నియోజకవర్గం నుంచి గులాబీ దండు వేలాదిగా కదంతొక్కాలని పిలుపునిచ్చారు. వార్డు నుంచి కుల సంఘాల నాయకులు, కార్యకర్తలు తరలిరావాలన్నారు. బహిరంగ సభకు ఒకరోజు ముందు ప్రతి వార్డులో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరించాలని సూచించారు. కేసీఆర్ స్పీచ్‌పై అంతటా చర్చ జరుగుతుందని, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, బీఆర్ఎస్‌ను ఆశీర్వదించడానికి ప్రజలు కూడా సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చింతా గోపాల్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, ప్రధాన కార్యదర్శి పిల్లిగుండ్ల వీరేశం, కార్యకర్తలు పాల్గొన్నారు.

### తాగునీరు సరఫరా చేయాలి

కోహీర్, ఏప్రిల్15: పదమూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదని కోహీర్ పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కోహీర్‌లోని మిషన్ భగీరథ నీటి సంపు వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని వారు నిలదీశారు. మిషన్ భగీరథ తాగునీటిని ఎందుకు సరఫరా చేయడం లేదని ప్రశ్నించారు. తాగునీరు లేకుంటే ఎలా బతుకాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. వేతనాలు ఇవ్వకపోవడంతో బుధేరా వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేస్తున్నారని అందుకే అక్కడి నుంచి తాగునీరు రావడం లేదని సిబ్బంది సమాధానమిచ్చారు. దీంతో స్థానికులు అక్కడి నుంచి వెనుదిరిగారు.

## జేఎన్టీయూలో టెక్నోఫెస్ట్ ప్రారంభం



ఆవిష్కరణను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నరసింహ

చౌటకూర్, ఏప్రిల్ 15: సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం 13వ టెక్నో ఫెస్ట్ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు 17వ తేదీ వరకు జరగనున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ విభాగాలకు సంబంధించిన ఇన్నోవేషన్స్‌ను ప్రారంభించారు. ఏడాదిపాటు చదువుకున్న సబ్జెక్టులకు సంబంధించిన వివిధ రకాల ప్రాజెక్టులను విద్యార్థులు తయారు చేసి ప్రదర్శించారు. సివిల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి ఎర్త్‌క్వేక్ రెసిస్టెంట్ బిల్డింగ్ దాని పనితీరు, భూకంపాలకు సంబంధించినప్పుడు భవనాలు ఎలా తట్టుకోవాలో ఆవిష్కరణల్లో వివరించారు. దీంతోపాటు నీటి పారిశుధ్యం, సస్పెన్షన్ బ్రిడ్జి, పార్కింగ్ డిజైన్ తదితర ప్రాజెక్టులను తయారు చేసి నమూనాలను అధ్యాపక సిబ్బందికి వివరించారు. ఈ నెల 16, 17వ తేదీల్లో మరిన్ని ఈవెంట్లు జరగనున్నాయి. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాధిపతులు, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ల అధ్యాపకులు పాల్గొన్నారు.